క్లుప్తంగా

ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యుడిగా రామకృష్ణ



ఖమ్మంమయూరిసెంటర్: అఖిల భారత విద్యార్థి సమైక్య జాతీయ కార్యవర్గ సభ్యులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ నెల 16, 17 తేదీల్లో ముంబైలోని బూపేష్ గుప్తాభవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాల్లో రామకృష్ణ జాతీయ కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తనపై నమ్మకం ఉంచి జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్న సంఘ రాష్ట్ర, జాతీయ సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం దిశగా మరిన్ని మిలిటెంట్ పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



ఆర్థికసాయం అందజేస్తున్న పుల్లయ్య

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుతారని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అన్నారు. గాంధీ మెడికల్ కళాశాలలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న నకిరికంటి లక్ష్మిప్రియకు ట్రస్ట్ నుంచి ఆదివారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు స్వరాజ్యలక్ష్మి, లక్ష్మిరాజ్యం, రామ్మోహన్‌రావు, మురళీకృష్ణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. ఈ మేరకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాదిగలను మోసం చేసిందన్నారు. ఈ శీతాకాల వర్గీకరణ బిల్లును తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.దయాకర్, జిల్లా అధ్యక్షులు గుండ్ల విజయభవాని, రవికుమార్, కనకరత్నం, రవి, సూర్యం, దశరథ్, వెంకటరత్నం, రాజేష్, ఉమేష్, రామస్వామి, రమేష్, దయాకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	పిండం,
	జోరుగా హుషారుగా
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	66		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	60	చుక్కకూర	3
బీర	56		20
దొండ	70	తోటకూర	3
పొట్లకాయ	36		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	60		10
క్యాబేజీ	20	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	36		10
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	34	పుదీన	1
ఉల్లిగడ్డ	50		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

ప్రారంభ దశలోనే శిథిలం!

అలంకారప్రాయంగా షాదీఖానా

- 20 ఏళ్లుగా వీడని గ్రహణం
- అసంపూర్తిగా నిర్మాణపనులు
- పశువులకు ఆవాసంగా మారిన వైనం



శిథిలమవుతున్న షాదీఖానా భవనం



కూసుమంచి: మండల కేంద్రంలోని తహసీల్ పక్కనే ముస్లిం కమ్యూనిటీ వివాహాలు, శుభకార్యాల కోసం ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవన నిర్మాణం అసంపూర్తిగా మారడంతో నేటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాల్లో భవన మరమ్మతుల పేరుతో పలుమార్లు నిధులను మంజూరు చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు యాచకులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనం ప్రారంభం కాకుండానే శిథిలమవుతుండగా.. కిటికీలు, తలుపులు కొన్ని విరిగిపోగా.. మరికొన్ని చోరీకి గురయ్యాయి. దీంతో షాదీఖానా ఉండీలేనట్లుగా మిగిలిపోయింది.

నిధులు వృథా..

ఈ భవన నిర్మాణం కోసం 2003లో నాటి ప్రభుత్వంలో రూ.5 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా అలాగే వదిలేశారు. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిధులు మంజూరు చేసినా భవనం ప్రారంభానికి మాత్రం గ్రహణం వీడడంలేదు. దీంతో లక్షలాది రూపాయలు వృథా కాగా ప్రస్తుతం పశువులకు ఆవాసంగా మారింది.

ముస్లింలకు ఇక్కట్లు..

ఇదిలా ఉండగా పాత భవనాన్ని అందుబాటులోకి తీసుకురాకుండానే దాని స్థానంలో మరిన్ని హంగులతో కొత్త భవనం నిర్మించాలనే ప్రతిపాదనను నాడు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉండగా పలువురు ముస్లింలు కోరారు. దీంతో రూ.50 లక్షలతో నూతన భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ నేటి వరకు దాని ఊసేలేదు. దీంతో ముస్లింలకు ఉన్నది అందుబాటులోకి రాక, కొత్తది నిర్మాణం చేపట్టక తమ శుభకార్యాలను నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వంలో పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి ఈ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు. కనీసం ఈ భవనాన్ని ఇతర ప్రజా అవసరాలకైనా వినియోగంలోకి తేవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి..

కూసుమంచిలోని షాదీఖానాను అందుబాటులోకి తీసుకొచ్చి ముస్లింలకు ప్రయోజనం కలిగేలా చూడాలి. మండల కేంద్రంలో షాదీఖానా లేకపోవడంతో వివాహం, శుభకార్యాలకు నిర్వహించుకునేందుకు ఇబ్బందిపడుతున్నాం. ముఖ్యంగా పేద ముస్లింలకు ఇది ఉపయోగంగా ఉంటుంది.

– షేక్ మీరాసాహెబ్, కూసుమంచి

మంత్రి దృష్టి సారించాలి..

మండల కేంద్రంలో గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా అసంపూర్తిగా ఉండడంతో అది ప్రారంభం కాలేదు. పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి దాన్ని అందుబాటులోకి తేవాలి. లేకుంటే వేరొక చోట కొత్తది మంజూరు చేయించాలి.

– మహ్మద్ షంషుద్దీన్

ప్రజల మధ్యనే ఉంటా...



మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: ఓడినా తాను ప్రజల మధ్యనే ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సాయిగణేష్‌నగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కందాళ మాట్లాడుతూ... రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయామని కుంగిపోవడం, బాధపడటం జరగదన్నారు. ప్రజాతీర్పును స్వాగతిస్తున్నట్లు, ఓడిపోయినప్పటికీ తాను ఎల్లవేళలా నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఓడిపోయామనే విషయాన్ని కార్యకర్తలు మర్చిపోవాలని, వారికి తాను అండగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం. వేణు, జెడ్పీటీసీ ఏ. వరప్రసాద్, నాయకులు ఏ.వెంకన్న, లక్ష్మణ్‌నాయక్, ఉన్నం బ్రహ్మయ్య, ఆనంద్, గుడిబోయిన దరగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఏర్పాటు నుంచి నేటి వరకు ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించారని, విద్యాసంస్కరణల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ఆరోపించారు. ఆదివారం ఖమ్మంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం కోసం కేసీఆర్ ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు విడుదల చేయకుండా కార్పొరేట్ విద్యాసంస్థలు పెంచి పోషిస్తుందన్నారు. మంత్రులు, తమ ఆత్మీయులకు ప్రైవేట్ యూనివర్సిటీలను ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి విశ్వవిద్యాలయాల ప్రమాణాలు దిగదార్చడం కోసం కృషి చేశారని విమర్శించారు. పేద విద్యార్థులు చదువుకునే విద్యార్థులకు నేటి వరకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగ సంస్కరణలు చేయాలని, అందరికీ నాణ్యమైన, సమానమైన విద్య అందించడం కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు జి.దీపిక, డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, డివిజన్ ఉపాధ్యక్షులు వినయ్, కోశాధికారి ఉష, నాయకులు శ్రీకాంత్, లాల్ పాషా, శ్రీను, సాజిద్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు తప్పక అమలు..



దిమ్మెను ఆవిష్కరిస్తున్న జావీద్

రఘునాథపాలెం: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఒకొక్కటి తప్పక అందిస్తుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి.జావీద్ అన్నారు. మండలకేంద్రమైన రఘునాథపాలెం పంచాయతీలోని కేసీఆర్ కాలనీలో నిర్మాణం చేసిన కాంగ్రెస్ పార్టీ దిమ్మెను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడే మందా బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు బాలాజీ, నాయకులు రెంట్యాల ప్రసాద్, తక్కెలపాటి భద్రయ్య, బోయినవెంకట నరసయ్య, గుడిపూడి రామారావు, తాతా రఘురాం, మంగ్యా, నాగరాజు, ఉపేందర్, కృష్ణ, తులసియా, ఎస్కే.గౌస్ బాషా, జాలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ హక్కును చట్టబద్ధం చేయాలి



మాట్లాడుతున్న రాములు

ఖమ్మంమయూరిసెంటర్: పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ హక్కును చట్టబద్ధం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్.శ్రీరాములు కోరారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి భవనంలో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు పెన్షనర్లపై తీవ్రమైన ప్రభావితం చూపుతున్నాయన్నారు. గోపిచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మల్లికార్జునరావు, కల్యాణం నాగేశ్వరరావు, గణపతి, కృష్ణారావు, మధు, జరీన, ఉమాదేవి, వీరబాబు, వీరభద్రం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షర్మిల జన్మదిన వేడుకలు



ఖమ్మంరూరల్: కేక్ కట్ చేస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదినం ఆదివారం మండలంలోని నాయుడుపేటలో గల క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎండపల్లి. వెంకయ్య, వైవీడీ రెడ్డి, తోట చినవెంకటరెడ్డి, మత్తిని యాలాద్రి, వాలూరి, సత్యనారాయణ, రూప్లానాయక్, తోట శ్రీనివాస్, ఉదయ్, ఉపేందర్, అల్లిక వెంకటి, తమ్మిశెట్టి కృష్ణ, కర్నాటి శ్రీకాంత్, రేలా నర్సింహారెడ్డి, బదావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఆదివారం సీతారామ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు గూడవల్లి రాంబ్రహ్మం, అనంతు కాశయ్య, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, నేలకొండపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ మైశా శంకర్, నిర్వాహకులు సంస్థ సీఎండీ రంగిశెట్టి వెంకటప్పయ్య, రావెళ్ల కృష్ణారావు, కందిబండ మోహన్‌రావు, నాయకులు వెన్నపూసల సీతారాములు, మరికంటి రేణుబాబు, ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల సత్యనారాయణ, మోర మల్లయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, దగ్గుల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో రైతుల వినతి



ప్రజావాణి వద్ద ఆదర్శ రైతుల సంఘం నేతలు

నేలకొండపల్లి: ఆదర్శ రైతులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందగట్ల సైదులు కోరారు. హైదరాబాద్‌లోని ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివారం నేలకొండపల్లిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంను పండుగ చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆదర్శ రైతుల వ్యవస్థను ప్రవేశపెట్టి వ్యవసాయంకు ప్రాణం పోశారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టినట్టుగా వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, పాపిరెడ్డి, సబీర్ ఆలీ, గుడిబోయిన వెంకటేశ్వర్లు, పెద్దపాక ముత్తయ్య, నోచిన లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో నూతన శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గుడి నిర్మాణానికి సోమవారం పండుగ వాతావరణంలో శంకుస్థాపన చేశారు. గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి దాత ఇచ్చిన స్థలంలో సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

ఖమ్మంలీగల్: రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా నియమించే నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ తెలంగాణ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. టీడీపీ కార్యకర్తలు సహకరించడం వల్లే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు.

గ్రామదీపిక మృతి

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామదీపిక కడారు హైమావతి (50) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పలువురు ఆమె మృతదేహం సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, సర్పంచ్ పెద్దపాక గురవమ్మ, నాయకులు మల్లెబోయిన శ్రీనివాసరావు, పోలంపల్లి నాగేశ్వరరావు, మల్లెబోయిన ఉపేందర్, గోళ్ల శ్రీనివాస్, పెద్దపాక సైదులు తదితరులు ఉన్నారు.

న్యాయవాది మృతికి 'బార్' సంతాపం

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది షేక్ కబీర్ ఆదివారం ఖమ్మంలో మృతిచెందగా బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. నేడు అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించనున్నారు. సంతాపం తెలిపిన వారిలో అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి మన్నెపల్లి బసవయ్య, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాధిరాజు లక్ష్మీనారాయణ, మువ్వా నాగేశ్వరరావు, మహిళా న్యాయవాదులు ఉన్నారు.

సంక్షేమం అమలుపై శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డ సందర్భంగా ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ మంగీలాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అభివృద్ధి ప్రణాళికలను మండల పరిషత్ సమావేశంలో చర్చించారు. వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాలు వచ్చే విధంగా రైతులను సమాయత్తం చేయలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



స్వామివారి పల్లకీ సేవకు ముందు పూజలు చేస్తున్న భక్తులు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలోని రామాలయం లో ఆదివారం నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కాపా వెంకటేశ్వరరావు లింగమ్మ, కిలారు ఆదినారాయణ రత్నకుమారి దంపతులు పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సమక్షంలో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. ధనుర్మాసం 30 రోజులు సాయంత్రం 8 గంటలకి పల్లకి సేవ నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా రోడ్డు మధ్యలో గుంత



రోడ్డు మధ్యలో పడిన గుంత

కామేపల్లి: ముచ్చర్ల క్రాస్ రోడ్డు మధ్యలో పెద్దగుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సెంటర్‌లో ఇంత పెద్ద గుంత ఉన్నా దానిని పూడ్చే పని చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదే విధంగా ముచ్చర్ల క్రాస్ రోడ్డు నుంచి ముచ్చర్ల గ్రామం వరకు పలు చోట్ల గుంతల కారణంగా రాత్రిళ్లు ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే భయమేస్తోందని, ఎక్కడ గుంత ఉందో తెలియక భయంతో వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తలనొప్పిగా మట్టి తవ్వకాలు..

- పోలీసులు వెంబడించి ఐదు టిప్పర్లు పట్టివేత..
- జేసీబీతో పాటు మరి కొన్ని టిప్పర్లతో పరారీ



స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచిన మట్టి టిప్పర్లు (ఫైల్)

రఘునాథపాలెం: పట్టుకోవడం, జరిమానాలు కట్టడం మళ్లీ యథావిధిగా మట్టి అక్రమ తవ్వకాలు తరలింపులు మండలంలో అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఆదివారం మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని విత్తన గిడ్డంగికి ఎదురుగా గుట్టపై అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై కొండలరావు, సిబ్బందితో దాడులు చేశారు. అప్పటికే పోలీసుల రాక సమాచారం అందుకున్న మట్టి మాఫియా తమ టిప్పర్లతో అక్కడ నుండి ఉడాయించే ప్రయత్నం చేశారు. అప్పటికే తవ్వకాలు చేస్తున్న జేసీబీతో పాటు, కొన్ని టిప్పర్లను వారు ఎంచుకున్న దారులలో తప్పించారు. ఎస్సై మాత్రం తమకు మట్టిలోడుతో ఉన్న ఒక టిప్పరు, మరో 4 ఖాళీ టిప్పర్లు మాత్రం దొరికాయని, వాటిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఇలా పోలీసులు పట్టుకోవడం, కేసులు, ఫైన్‌లు చెల్లించడం అనేది నిత్యం కొనసాగుతూనే ఉంది. తాను సమీక్ష చేసేంత వరకు జిల్లాలో మట్టి, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఇటీవల మంత్రిగా బాధ్యత తీసుకొన్న ఒక మంత్రి సంబంధిత అధికారులకు సూచించినట్టు తెలిసింది. అధికారులు పదే పదే కేసులు పెడుతున్నా.. తమ తీరు ఇంతే అన్నట్టుగా మట్టి తవ్వకందారులు తమ దందా కొనసాగిస్తూనే ఉన్నారు అనేందుకు పోలీసులకు పట్టుబడిన టిప్పర్లే ఉదాహరణ. నేషనల్ హైవేహదార్లు నిర్మాణం పేరుతో ఇక్కడ పెద్ద మొత్తంలో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ఆపేరుతో మట్టి పెద్ద మొత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఇతర ప్రైవేటు అవసరాలకు తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే మండలంలో కోట్ల రూపాయల మట్టి కుంభకోణం జరిగిందని పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం, ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీలు మట్టి తవ్వకాలపైనే ఎక్కువ ప్రచారం సాగించిన విషయం తెలిసిందే. దీంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మట్టి తవ్వకాలపై ఎలాంటి చర్యలు ఉంటాయనే దానిపై సర్వత్రా ఎదురు చూస్తున్నారు.